# పాలపిట్ట గూడు పెట్టింది

"అప్పా అప్పా మనికి పాల్పిట్టొచ్చుద్దే-ఫ్ఫ్ అబ్బ ఎంత సల్లగుండయ్యే అప్పా!" అంటా బల్ వుసారుమీద సందేల యింటికి లగెత్తుకొచ్చి, మంచమ్మీన అప్ప సెంద్రమ్మకాడ ఎగ్గిరి కూకుండాడు కిట్టాయి.

"అబ్బ నీ పిల్లోడు సల్లగుండ! అట్టెగిరి పడ్డాదేం-ఏందిరా సప్పరిత్తుండావు కిట్టా? నాకు పెట్ట వంట్రా?" అంది వయసొచ్చిన సెంద్రమ్మ, కొప్పులో బంతిపూలు దోపుకుంటా.

"అబ్బ యిప్పటికీ ఎంత సల్లగుందే నోరూ! చుందరయ్య మంచోడు గదంటే అప్పా?"

"ఆఁ-ఎవురూ?"

"మన గుడికాడ యిసికి దిబ్బమీన దినాం కూకోడంటే చుందరయ్యా, ఆయినే!"

ఒక్కపాలి సెంద్రమ్మ పయిటెనక గబిక్కిన కదల బార్నయి-గుండె జల్మనంటే.

"ఏం దప్పా అట్ట జూత్తావు? ఆ యిన్నెరగవంటే-ఆ దినం సీకట్లో బాయికాడి కెల్లొత్తావుంటే ఎనికీడ్తే ఒచ్చి నిన్ను-"

"తెల్చులే అరవమాకా-సెతురుకి పొట్టుకుంటేనూ-"

"క్లె! నేనే అట్టాటి గిరజాల్దిరిగిన మడ్సినైతేనా! మైసూర్పాక బొయ్యేవోణ్ణా!"

"అరవమాకరా అయ్యొత్తాడేవోఁ!"

"మనయ్యకు సెవుఁడు గాదంటే - అప్పా అయ్యేడికెల్లాడే?"

"గాదె అల్లికయితే యిచ్చి రాబొయ్యాడుగానీ-యాడుండాడు ఆ యబ్బాయీ?"

"ఎవురు చుందరయ్యా? మరే, నేనే, పిల్లెమ్మల్నెతుక్కుంటా పోతా వుంటేని, వూరకనే జోబిలోంచి బిల్లల్దీసి పెట్టాదే!"

"వూరకనే పెట్టాడంట్రా?"

"ఆఁ కాదే! పాల్పిట్టే ఎగురుకుంటా ఒచ్చి గుడికాడ సింసెట్టుమీన వాల్తేనీ, అబ్బ బ్బబ్బ"

"ఆఁ?"

"అబ్బబ్బ! బల్ పాల్పిట్ట అంటేనీ, 'అంతకాడికి మనగాడ్దాన్నిప్పిత్తా, యిటొచ్చి కూకోమంటా' బిల్లలు పెట్టాదే!"

"ఆమయిన లగెత్తుకొచ్చా?"

"ఆఁ. సింసెట్టుకాడ పాల్పిట్ట ఏం తిరుగాడ్తుండదనుకుండా అప్పా? ఆడో తొ్రరుండే! ఆడ గూడు పెట్టదంటే పాల్పిట్టా?"

"ఆమయిన లగెత్తుకొచ్చావంట్రా?"

"ఆహాఁ, పాల్పిట్ట యిప్పిత్తానన్లా చుందరయ్యా?"

"ఆఁ"

"ఆడే కూకున్నా!"

"ఆఁ!"

"అప్పోవ్, నువంటే బల్ గురుండదే మద్చికీ!"

"ఏందీ?"

"మీ అప్పకు బిల్లలు పెట్టి ఎట్టుండయ్యో అడిగిరా, అన్నాదే!"

"ఓమ్మో!"

"ఏవిఁటికమ్మా బయిం? నే నే సెంద్రమ్మప్ప నయితేనా! –"

"ఆఁ ఏందిరా?"

"చుందరయ్య ఆడే వుంటాన్నాదుగామ్మా–?"

"అయ్యొత్తే?"

"ఏమ్మా ఒత్తే?"

"నాకు ఒనుకు పుద్తండది నే ఎల్లనయ్యా!"

"అప్పేదంటే బాయికాడి కెల్లిందంటాగా!"

"నిజంగానంట్రా–వుప్పుడే ఒత్తాగాని సెప్పమాకా – ఏ మయిద్దో–"

"అప్పప్పా?"

"అయ్యొచ్చాదా?"

"రాలేదుగాని–ఏదమ్మా పాల్పిట్టా?"

"తాలుండు–అబ్బ కల్లు తిరుగుతుండై–"

"తేలేదంటే–?"

"గూడు పెద్తున్నదంట! రేపు రేత్తిరికొత్తే యిత్తానన్నాడ్రా–అయ్యొత్తాడు. కూసేపు పొండుకుందాం–అరవమాక–"